# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 120 కృష్ణా, ఆదివారం 25 - 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## బాలికలకు స్టడీ మెటీరియల్ అందచేశారు ఛైర్మన్ చిట్టిబాబు..





**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి,జనవరి 24(క్రైం కౌంటర్ డెస్క్):** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కొండపల్లి బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థునులకు స్టడీ మెటీరియల్ అందజేశారు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి,కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. పదవ తరగతి చదువుతున్న బాలికలకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, పోటీ ప్రపంచంలో విజయం సాధించాలని తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి ఎండి అప్సర్, టిడిపి సీనియర్ నాయకులు కరిమికొండ బాలాజీ, మున్సిపల్ బిజెపి కో–ఆప్షన్ సభ్యురాలు నగీన,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రజలకు విద్యుత్ ఊరట.. వచ్చే మూడేళ్లలో రూ. 4 కే యూనిట్ విద్యుత్!



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 24,** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాబోయే మూడేళ్ల కాలంలో విద్యుత్ ఛార్జీలను భారీగా తగ్గించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఇప్పటికే అమలవుతున్న సంస్కరణల ద్వారా సామాన్యుడిపై భారం తగ్గించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. విద్యుత్ రంగంలో తీసుకువస్తున్న మార్పులు భవిష్యత్తులో రాష్ట్ర పారిశ్రామిక, గృహ అవసరాలకు ఎంతో మేలు చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం నుంచి అధికారం చేపట్టే నాటికి రాష్ట్రంలో విద్యుత్ యూనిట్ ధర రూ. 5.19 గా ఉందని మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రాథమికంగా యూనిట్?పై 29 పైసల వరకు తగ్గించినట్లు ఆయన వివరించారు. దీనికి తోడు ఇప్పటికే యూనిట్?కు 13 పైసల మేర 'ట్రూ డౌన్' చేయడం ద్వారా వినియోగదారులకు కొంత ఉపశమనం లభించిందని, ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో విద్యుత్ ఛార్జీలను మరింత క్రమబద్ధీకరించి, యూనిట్‌ధరను కేవలం రూ. 4 లకే అందించడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని గొట్టిపాటి రవి ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న ధరపై దాదాపు రూ. 1.19 మేర తగ్గించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మరో 90 పైసల తగ్గింపునకు సంబంధించి కసరత్తు వేగవంతం చేశామని, దీనివల్ల మధ్యతరగతి మరియు పేద కుటుంబాలకు భారీగా లబ్ధి చేకూరుతుందని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం మరియు పంపిణీ వ్యవస్థలో నష్టాలను అరికట్టడం ద్వారానే ఈ అసాధ్యమైన లక్ష్యాన్ని సుసాధ్యం చేస్తామని ప్రభుత్వం భావిస్తోంది. పారదర్శకమైన విధానాలు మరియు సమర్థవంతమైన నిర్వహణ ద్వారా విద్యుత్ రంగాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గతంలో పెరిగిన అదనపు భారం నుంచి ప్రజలను విముక్తం చేసి, తక్కువ ధరకే నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

## నరకాసురుడి లాంటి వ్యక్తి మళ్లీ వస్తే రాష్ట్రం నాశనమవుతుందన్న చంద్రబాబు




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 24,** ఐదేళ్ల రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందని, ఈ కాలంలో రాష్ట్రం అన్ని విధాలుగా అతలాకుతలమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా చేసిన గత ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. నగరిలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్?తో ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారని గుర్తు చేశారు.గత ఐదేళ్లలో రాక్షస పాలన వల్ల రాష్ట్రం అతలాకుతలమైంది. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారు. నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాం. 94 శాతం స్ట్రైక్ రేటుతో విజయం సాధించాం. గత పాలనలో అమరావతిపై మూడు ముక్కలాట ఆడారు. శ్మశానం, ఎడారి అన్నారు. ఇప్పుడూ ప్రెస్ మీట్లు పెట్టి క్రెడిట్ చోరీ చేశామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. క్రెడిట్ చోరీ అనేవారికి ఏం క్రెడిట్ ఉందని మాట్లాడుతున్నారురాజధానిపైనా విషం చిమ్ముతున్నారు. నాపై నమ్మకంతో 29 వేల మంది రైతులు 33 వేలు ఎకరాల భూమి రాజధాని కోసం ఇచ్చారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి ఆగదు. ఆనాడు సైబరాబాద్ నగరాన్ని నిర్మించాను. నేడు అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశం ప్రజలు ఇచ్చారు. ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని తయారుచేస్తాం. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పేదల సేవలో, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం 2, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం. 18 నెలల్లో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. దేశంలో 25 శాతం పెట్టుబడులు మన రాష్ట్రానికే రావడం ఎన్డీఏ ప్రభుత్వ సమర్థత పాలనకు నిదర్శనం అని ముఖ్యమంత్రి అన్నారు.ప్రజలకు భూమి అంటే సెంటిమెంట్ అని, అలాంటి భూమికి గత ప్రభుత్వంలో భద్రత లేకుండా చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు.ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అనే దుర్మార్గపు చట్టంతో, 22ఏ అక్రమాలతో ప్రజల జీవితాలతో వికృత క్రీడ ఆడారు. సర్వే రాళ్లు, పాస్ పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం కోసం రూ. 700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు అని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టిందని తెలిపారు.మేం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్?ను రద్దు చేశాం. ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించాం. రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందించి, మీ భూమికి మేం గ్యారెంటీ అని భరోసా ఇచ్చాం అని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా సర్వనాశనం చేసి రాయలసీమను రాళ్ల సీమగా మార్చారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకే రాష్ట్రంలో తిరిగి అభివృద్ధి, సంక్షేమ పాలన మొదలైందని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసులో సంచలన నిజాలు..



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 24,** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన టీటీడీ కల్తీ నెయ్యి కేసులో సిట్ ఎంక్వయిరీ పూర్తయింది. 2024 సెప్టెంబర్ 25న తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటై విచారణ కొనసాగింది. దాదాపు 16 నెలలపాటు 10 రా(ష్ట్రాల్లో విచారణ జరగ్గా.. మొత్తం 36 మందిని నిందితులుగా చేర్చింది. ప్రధానంగా.. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రైవేట్ చిన్నఅప్పన్న అరెస్ట్ తర్వాత సిట్ విచారణ వేగవంతమై ఛార్జ్‌షీట్ వరకు వెళ్లింది. గతేడాది మేలో తొలి ఛార్జ్‌షీట్ ఫైల్ చేసిన సిట్.. ఇప్పుడు ఫైనల్ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతోపాటు.. కీలక అంశాలను చేర్చింది. ఉత్తరాఖండ్‌కు చెందిన బోలే బాబా ఆర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు పొమిల్, విపిన్ జైన్‌లను కీలక సూత్రధారులుగా గుర్తించింది. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ , గా ఉన్న సుబ్రహ్మణ్యం, చిన్నఅప్పన్న కూడా కీలకమని సిట్ తేల్చింది. వీరిద్దరి స్టేట్‌మెంట్స్‌తోనే కల్తీ నెయ్యి కేసు కొలిక్కి వచ్చినట్లు సిట్ వెల్లడించింది. నిందితుల స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఫైనల్ చార్జ్‌సీట్ దాఖలు చేసిన సిట్.. అవకతవకలు, లబ్ది పొందినవారి వివరాలను స్పష్టంగా పేర్కొంది. హవాలా ద్వారా చిన్నఅప్పన్నకు రెండుసార్లు 50 లక్షల రూపాయల చొప్పున అందజేసినట్లు ముంబై హవాలా ఏజెంట్ అమన్‌గుప్తా అంగీకరించినట్లు ఆధారాలు సేకరించింది. దీనిలో భాగంగానే.. టీటీడీ ఉన్నతాధికారులు, అప్పటి టీటీడీ చైర్మన్లను విచారించిన సిట్.. చిన్నఅప్పన్న ఆస్తులు, ఆయనకు సహకరించిన వారి వివరాలను కూడా సిట్ ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చింది. ఇదిలావుంటే.. టీటీడీ కల్తీ నెయ్యి కేసులో 36 మందితో పాటు విచారణకు పిలిచిన టీటీడీ మాజీ చైర్మన్లు, ఈవోల పేర్లు కూడా చార్జ్‌షీట్‌లో ఉంటాయన్న సస్పెన్స్‌కు సిట్ తెర దింపింది. నిందితుల సంఖ్య పెరగకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న నేతల పేర్లు ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో లేకపోవడంతో రాజకీయ ప్రాధాన్యత లేనట్లేనా అన్న చర్చ జరుగుతోంది. కేవలం టీటీడీలో నెయ్యి ఎలా కల్తీ జరిగింది?.. ఈ కేసులో అసలు దొంగలు ఎవరు?.. ఎవరి పాత్ర ఏంటి?.. అనే అంశాలను మాత్రమే సిట్.. ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చింది. ఉత్తరాఖండ్‌కు చెందిన బోలె బాబా ఆర్గానిక్ డెయిరీ, తమిళనాడులోని ఏఆర్ డెయిరీ, ఏపీలోని వైష్ణవి డెయిరీల లాలూచీని బహిర్గతం చేసింది. టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలన్న టార్గెట్‌గా ఏఆర్ డెయిరీతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు తేల్చింది.
నకిలీ సీల్స్, తప్పుడు జీఎస్టీ బిల్లులు, ల్యాబ్ రిపోర్టులు, వారెంటీ సర్టిఫికెట్లతో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా అయినట్లు గుర్తించింది. అర్హత, సామర్థం లేని ఏఆర్ డెయిరీ నుంచి నెయ్యి సరఫరా ప్రయత్నాలను సిట్ గుట్టురట్టు చేసింది. అటు.. ఆయా డెయిరీల నిర్వాహకుల బాగోతాన్ని గతంలోనే రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ బట్టబయలు చేసింది. మొత్తంగా.. ఇప్పుడు ఫైనల్ ఛార్జ్‌షీట్‌తో తిరుమల కల్తీ నెయ్యి కేసులో సిట్ ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. రాజకీయ ప్రాధాన్యత లేనట్లేనన్న సంకేతాలతో పొలిటికల్ సస్పెన్స్‌కు ఫుల్‌స్టాప్ పడింది. ఫలితంగా.. టీటీడీ మాజీ చైర్మన్లు, ఈవోలకు ఈ కేసు నుంచి ఊరట దక్కినట్లు అవుతోంది.

## సీతంపేట, ఎస్.కోట ఆస్పత్రుల్లో త్వరలో ప్రారంభం: మంత్రి సత్యకుమార్



**క్రైం కౌంటర్ న్యూస్,**అమరావతి, జనవరి 24: గ్రామీణ కిడ్నీ రోగులకు కష్టాలు తొలగించేలా రాష్ట్రంలో కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇంతకుముందు ప్రకటించిన వాటితో పాటు కొత్తగా మంజూరైన ఐదింటితో కలిపి మొత్తం 13 సెంటర్లు సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో రాబోతున్నాయని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ (పీఎంఎన్‌డీఎస్) కింద తిరుపతి జిల్లా రైల్వేకోడూరు, ప్రకాశం జిల్లా కొండపి, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, కడప జిల్లా మైదుకూరు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని సీహెచ్‌సీల్లో డయాలసిస్ కేంద్రాలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటికే భీమవరం, పీలేరు, వెంకటగిరి, అద్దంకి, సున్నిపెంట, జమ్మలమడుగులో కేంద్రాల ఏర్పాటు ప్రకిర్రయ టెండర్ దశలో ఉన్నాయన్నారు. రెండు కేంద్రాలు గిరిజన ప్రాంతాలైన సీతంపేట, ఎస్.కోట ఆసుపత్రుల్లో సిద్ధమయ్యాయని, వీటిల్లో అతి త్వరలో సేవలు ప్రారంభం అవుతాయని, మిగిలిన కేంద్రాలు ఏప్రిల్ నాటికి సిద్ధం అవుతాయని తెలిపారు. ఒక్కొక్క కేంద్రంలో సుమారు రూ.85 లక్షల విలువ చేసే రక్తశుద్ధి యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 13 కేంద్రాలకు కలిపి రూ.11.05 కోట్ల వరకూ వ్యయం చేస్తున్నామన్నారు. ఒక్కొక్క కేంద్రంలో ఐదు చొప్పున మిషన్లు ఉంటాయని, ప్రతి కేంద్రంలో రోజుకి మూడు సెషన్లలో రక్తశుద్ధి జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్ సేవలు అందుతున్నాయన్నారు. 2024–25 లో కిడ్నీ బాధితుల కోసం రూ.164 కోట్లు వరకూ కూటమి ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు.

# ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపణలను ఖండించిన జనసేన నేత బొలిశెట్టి



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 24, అమరావతి రాజధాని నిర్మాణం విషయంలో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఏబీ వెంకటేశ్వరరావు తనపై చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ బొలిశెట్టి సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. తన పోరాటం రాజకీయాల కోసం కాదని, కేవలం పర్యావరణ పరిరక్షణ కోసమేనని స్పష్టం చేస్తూ, అమరావతి అంశంపై బహిరంగ చర్చకు రావాలని ఏబీకి సవాల్ విసిరారు. ఏబీ వెంకటేశ్వరరావు తన ఫేస్?బుక్ పోస్ట్?లో చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యాలతో నిండి ఉన్నాయని బొలిశెట్టి మండిపడ్డారు. వైసీపీ ప్రోద్బలంతో తాను అమరావతిపై కేసులు వేశాననడానికి ఆధారాలు ఉన్నాయా అని నిలదీశారు. తాను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు వేసింది 2015-17 మధ్య కాలంలో అని, అప్పుడు వైసీపీ అధికారంలోనే లేదని గుర్తుచేశారు. వాయిదా కోసం రూ.20 లక్షలు తీసుకున్నానన్న ఆరోపణకు సాక్ష్యం చూపాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి, అప్పటి టీడీపీ ప్రభుత్వం పర్యావరణ అనుమతుల విషయంలో నిబంధనలను అతిక్రమించిందని, 1.5 లక్షల చదరపు మీటర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతికి బదులుగా రాష్ట్ర స్థాయి కమిటీతో సరిపెట్టిందని ఆరోపించారు. తాను ఎన్జీటీలో కేసు వేయడమనేది రాజధానిని అడ్డుకోవడానికి కాదని, అప్పటి ప్రభుత్వం స్వయంగా ఇచ్చిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక లోని అంశాలనే అమలు చేయాలని కోరడానికేనని బొలిశెట్టి వివరించారు. కృష్ణా నది వరద మైదానాలను, కొండవీటి వాగును కాపాడాలని ఎన్జీటీ ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. తాను విశాఖ వాసినైనప్పటికీ అక్కడ రాజధాని వద్దని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, తనది ప్రాంతాలకతీతమైన పర్యావరణ పోరాటమని స్పష్టం చేశారు. టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల తప్పులను వ్యతిరేకించానని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం తప్పు చేసినా ప్రకృతి సంపదను కాపాడటానికి ఎదిరిస్తానని ఉద్ఘాటించారు. ఈ క్రమంలో ఏబీ వెంకటేశ్వరరావుపై వ్యక్తిగత విమర్శలు కూడా చేసిన బొలిశెట్టి, ఆయన సర్వీసులో ఉన్నప్పుడు జరిగిన అవకతవకలను బయటపెడతానని హెచ్చరించారు. అమరావతిపై చర్చకు వచ్చే ముందు దాని చరిత్ర, పర్యావరణ నివేదికలు, ఎన్జీటీ తీర్పులను అధ్యయనం చేయాలని సూచిస్తూ, ఆ పత్రాలను తన పోస్ట్?కు జతచేశారు. సమయం, వేదిక మీరే ఎంచుకోవాలని, పార్టీలకు అతీతంగా పర్యావరణ పరిరక్షణ కోసం నిజాలు మాట్లాడదాం రండి అంటూ ఏబీకి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు.

# ఉగాదికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలి



క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, జనవరి 24: 'పేదల ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లగలరా? లేదా? మీరు చేయలేకపోతే చెప్పండి.. డిపార్ట్‌మెంట్‌ను మూసేసి ఏ ఇంజనీరింగ్ శాఖలోనో విలీనం చేసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మీరు ఇలాగే పనిచేస్తామంటే మాత్రం ఇక మీ భవిష్యత్తును ముఖ్యమంత్రే డిసైడ్ చేస్తారు' అంటూ గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. శుక్రవారం విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల హౌసింగ్ హెడ్‌లు, డివిజినల్ హెడ్‌లతో మంత్రి కొలుసు ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పలు జిల్లాల పీడీలు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కొలుసు స్పందిస్తూ.. 'రాష్ట్రంలో రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి ఇప్పటికి 15 వేల ఇళ్లు నిర్మించారు. ఇంకా దాదాపు 13వేల ఇళ్లు నిర్మించాల్సి ఉంది. వీటిని ఈ ఏడాది సెప్టెంబరులోగా పూర్తిచేయకపోతే రూ. వేల కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఇప్పటివరకు కట్టిన ఇళ్లు నివాసయోగ్యంగా లేకపోతే మరి వాటిని ఏం చేయాలి? స్థలం, ఇళ్లు, సదుపాయాలతో కలిపి దాదాపు రూ.30వేల కోట్ల వరకు ఖర్చు చేశారు. సమస్యలున్నాయని సాకులు చెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదు. కాలనీలకు లబ్ధిదారులను తీసుకువచ్చే బాధ్యత మీదే. వారిని కట్టిన ఇళ్లలో నివాసం ఉండేలా ఒప్పించండి. అంగీకరించని వారిని ఆ ఇళ్లు వద్దని రాసి ఇవ్వమనండి. వాటిని మిగతా పేదలకు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది' అని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే వదిలేసిపోయిన కాంట్రాక్టర్లపై కేసులు పెట్టాలని మంత్రి ఆదేశించారు. ఇళ్లు కట్టడానికి ముందుకొచ్చే కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించాలన్నారు.

# స్వచ్ఛాంధ్ర.. మన జీవన విధానం కావాలి



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 24, స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, మన జీవన విధానం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'పీల్చే గాలి, తినే తిండి, తాగే నీళ్లు.. ఇలా అన్నీ పరిశుభ్రంగా, కాలుష్యరహితంగా ఉండాలి. ఇవన్నీ కావాలంటే మన ఆలోచనలు స్వచ్ఛం గా ఉండాలి. స్వచ్ఛమైన ఆలోచనల్లేని నేరస్థులు పాలిస్తే ఎలా ఉంటుందో గత ఐదేళ్లు చూశాం. స్వచ్ఛాంధ్ర విషయంలో మీరం తా సహకరిస్తే వచ్చే ఐదేళ్లలో రా(ష్ట్రాన్ని నంబర్ వన్‌గా తయారు చేస్తాను. దేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మోదీ స్వచ్ఛ భారత్ తెచ్చారు. గతంలో మనం కూడా జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలతో స్వచ్ఛత కో సం పనిచేశాం. పరిశుభ్రత విషయంలో మనందరి ఆలోచనలు మారాలి. పాఠశాలల్లో విద్యార్థులు పరిశుభ్రంగా ఉండేందుకు ముస్తాబు అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాం. దీంతో విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లో భారీ స్వీపింగ్ యం త్రాలను వినియోగిస్తున్నాం. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 97.26 శాతం, గ్రా మీణ ప్రాంతాల్లో 62 శాతం ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగుతోంది. మార్చి నాటికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వంద శాతం సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యర్థాల నుంచి విద్యుత్తు తయారీ యూనిట్లు ఇప్పటికే నాలుగు ఉన్నాయి. రాజమండ్రి, విజయవాడలో మరో రెండు ప్రారంభించనున్నాం. ప్లాస్టిక్, ఈ-వేస్టను సేకరించేందుకు 130 స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాల్లో ఈ వాహనాలు పర్యటించి చెత్త తీసుకుని నిత్యావసరాలు అందిస్తాయి. మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 660 స్వచ్ఛ రథాలను తీసుకొస్తాం' అని అన్నారు.

గత ప్రభుత్వ చెత్తను తొలగిస్తున్నాం

రూ.573 కోట్లతో స్వచ్ఛాంధ్ర కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశామని చంద్రబాబు చెప్పారు. 110 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటుకు రూ.510 కోట్లు ఖర్చు చేశామన్నారు. కంపోస్ట్ తయారీ కోసం డస్ట్‌బిన్లను ఇస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ఈ-ఆటోలు, ట్రై సైకిళ్లు, తోపుడు బండ్లను ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పట్టణ ప్రాంతాల్లో వదిలేసి వెళ్లిపోవడంతో భూమి, భూగర్భ జలాలతో పాటు వాయు కాలుష్యం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు ఆ వ్యర్థాలన్నీ తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నట్లు చెప్పారు.

రాబోయే రోజుల్లో ఏఐ డాక్టర్..

'గతంలో నేను టెక్నాలజీ అంటే అవహేళన చేశారు. ఇప్పుడు అదే టెక్నాలజీ మన సంపదను పెంచింది. రాబోయే రోజుల్లో ఏఐ డాక్టర్ ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై దృష్టి పెట్టే పరిస్థితి వస్తుంది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యం కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండగా, ఇప్పుడు పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాల ద్వారా ఇళ్లపైన, పొలాల్లో సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకునే పరిస్థితి వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తోంది. గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్‌లాంటివి కూడా ఉత్పత్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జనాభా మన సంపద. గతంలో కుటుంబ నియంత్రణను నేనే ప్రోత్సహించా. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎక్కువ మంది పిల్లలుంటేనే ఎన్నిక ల్లో అర్హత అంటున్నాను. దక్షిణాదిన అన్ని రా(ష్ట్రాల్లోనూ జనాభా తగ్గుతోంది. మన వద్ద మాత్రమే జనాభా పెరుగుతోంది' అని సీఎం తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, విప్ థామస్ వేదిక పంచుకున్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హెలిప్యాడ్‌లో సీఎంను కలిశారు.

# కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో సీఎం భేటీ

క్రైం కౌంటర్ న్యూస్ అమరావతి, జనవరి 24 సీఎం చంద్రబాబు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్? రామ్? మేఘ్వాల్?తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం నగరి పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబు అదే సమయంలో ఢిల్లీ వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చిన మేఘ్వాల్?తో వీఐపీ లాంజ్?లో కొద్దిసేపు సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు.

# ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 24, భారతదేశం సంస్కరణల ఎక్స్?ప్రెస్?గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్?గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్?గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్?గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్?గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# బీపీసీఎల్, ఇండోసోల్ ప్రాజెక్టుల భూసేకరణ బాధ్యతలు నెల్లూరు కలెక్టర్‌కే!



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, జనవరి 24: ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో రెండు కీలక ప్రాజెక్టులకు భూసేకరణ బాధ్యతలను నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు (జీవో-54) జారీచేశారు. ఇంతకు ముందు గుడ్లూరు మండలంలోని రావూరు, చేవూరు గ్రామాలు, ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామం నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఇటీవలి జిల్లాల పునర్విభజన తర్వాత ఈ రెండు మండలాలు నెల్లూరు నుంచి తిరిగి ప్రకాశం జిల్లాలోకి వచ్చాయి. అయితే ఆయా మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నప్పుడే చేవూరులో బీపీసీఎల్ రిఫైనరీకి, కరేడులో ఇండోసోల్ ప్రాజెక్టుకు భూసేకరణ ప్రారంభించారు. ఇప్పుడు ఆ గ్రామాలు ప్రకాశంలోకి రాగా.. సాధారణంగా అయితే ఆ జిల్లా కలెక్టర్‌నే భూసేకరణ బాధ్యతలు చూడాలి. అయితే నెల్లూరు జిల్లాలో ఆ గ్రామాలున్నప్పుడే, ఆ జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా ఆ రెండు ప్రాజెక్టులకు భూసేకరణ నోటిఫికేషన్లు ఇచ్చారు. రైతులతో మాట్లాడి భూములు ఇచ్చేందుకు ఒప్పించారు. ప్రస్తుతం భూసేకరణ పనులు కీలక దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు కలెక్టరే ఆ రెండు ప్రాజెక్టుల భూసేకరణ బాధ్యతలు చూడాలని సర్కారు ఆదేశించింది.

# టీడీపీ కార్యాలయంలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా



క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 26న టీడీపీ కేంద్ర కార్యాలయంలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఎగురవేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో జాతీయ జెండాను ప్రత్యేకంగా ముంబై నుంచి తెప్పించారు. దాని పక్కనే 102 అడుగుల ఎత్తులో పార్టీ జెండాను కూడా ఏర్పాటు చేశారు. ఈ జెండాలను ఎగురవేసే సమయంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా ఉండేందుకు ఆటోమేటిక్? మూవింగ్? టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దీనిని శనివారం ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

# జగన్... మళ్లీ ల్యాండ్ టైట్లింగ్ పేరెత్తే ధైర్యం ఉందా..!



క్రైం కౌంటర్ న్యూస్,గుంటూరు, జనవరి 24 'మళ్లీ అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టుని పునరుద్ధరిస్తా. సర్వే రాళ్లపై, పాసు పుస్తకాల్లో నా బొమ్మ వేసుకుంటా... అని చెప్పగలరా జగన్?' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. గుంటూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రజలకు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కాకుండా జిరాక్స్ కాపీలు ఇస్తామని చెప్పే ధైర్యం ఉందో, లేదో జగన్ చెప్పాలి. 2029లో జరిగే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు తీసుకొచ్చి గతంలో ఏవైతే నిబంధనలు అందులో పొందుపరిచారో, అవన్నీ అమలు చేస్తానని చెబితే అప్పుడు ప్రజలు ఆయన్ని నమ్ముతారో, కూటమి ప్రభుత్వాన్ని నమ్ముతారో తేలుతుంది. అహంకారం, అహంభావం, అసమర్థత వల్ల గత ఎన్నికల్లో ప్రజలు మట్టికరిపించారన్న విషయాన్ని జగన్ జీర్ణించుకోవాలి. ల్యాండ్ సర్వే, రీసర్వే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానిది. ఇది గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైంది. అయితే సర్వే, రీసర్వేని పూర్తి చేయకపోవడం వల్ల ప్రోత్సాహకాల కోసం గత వైసీపీ ప్రభుత్వం దరఖాస్తు చేయలేదు. ఇందులో రైతులకు సంబంధించిన ఫిర్యాదులు లక్షలున్నాయి. వాటిని పరిష్కరించకపోవడం వల్ల ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విషయాన్ని నేను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. 2 లక్షల 79 వేల 712 ప్రజా ఫిర్యాదులను గ్రామసభల ద్వారా పరిష్కరించాలని చెప్పాను. ఇందులో భూమి కొలతల్లో వ్యత్యాసాలు 99 వేలు, జాయింట్ ల్యాండ్ పార్సిల్స్ వివాదాలు 64 వేలు, రెవెన్యూ సమస్యలు 1.14 లక్షల కేసులున్నాయి.

వీటిని కేంద్రంతో సమన్వయం చేసుకుని క్లియర్ చేసి ప్రోత్సాహకాల కోసం అప్లై చేసి రూ.500 కోట్లు తెచ్చిన ఘనత మాకే దక్కుతుంది. జగన్‌పై వ్యతిరేకతకు కారణం సర్వే, రీసర్వే కాదు. సర్వే చేసిన తర్వాత కొత్త పాసు పుస్తకాలు ఇవ్వాలి. అయితే వాటిపై జగన్ తన బొమ్మ వేసుకున్నారు. తాతలు, తండ్రులు ఇచ్చిన ఆస్తులపై దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి వారి బొమ్మ వేసుకోలేదు. దీనికి రూ.20 కోట్లు ఖర్చు పెట్టారు. రూ.680 కోట్లు ఖర్చు పెట్టి జగన్ బొమ్మతో సర్వే రాళ్లు వేశారు. భయానకమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టం వలన ఏదైనా వివాదం ఉంటే సివిల్ కోర్టులను బైపాస్ చేసి, తహసీల్దారు కార్యాలయాలను మాత్రమే ఆశ్రయించాలన్న నిబంధన పొందుపరిచారు. అక్కడ న్యాయం దక్కలేదంటే హైకోర్టుకు వెళ్లాలి తప్ప సివిల్ కోర్టులకు వెళ్లలేరు. హైకోర్టుకు వెళ్లాలంటే ఫీజుల రూపంలో రూ.లక్షలు ఖర్చు చేయాలి. అంత మొత్తాన్ని పేదలు భరించలేరు. ఈ నేపథ్యంలో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి చేసి భూములు లాక్కొంటారన్న భయాందోళనలు జనంలో వచ్చాయి. అందుకే ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించారు. అంతే తప్ప సర్వే, రీసర్వే వల్ల కాదు' అని పెమ్మసాని స్పష్టం చేశారు.

# కొల్లగొడుతున్నారు!

**సాగర్ కాలువపై నుంచి రాకపోకలు**
**పూర్తిగా దెబ్బతింటున్న కట్ట**
**అధికారులు కందకాలు తీయించినా పూడ్చివేసిన అక్రమార్కులు**
**ఇరిగేషన్‌శాఖ ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు**

క్రైం కౌంటర్ న్యూస్, ఒంగోలు(రూరల్), జనవరి24 ఒంగోలు మండలం యరజర్ల పరిధిలోని కొండను గ్రావెల్ మాఫియా గుల్ల చేస్తోంది. అక్రమంగా తవ్వకాలు చేసి తరలిస్తోంది. దీంతో ఒంగోలు, కొత్తపట్నం గ్రామాలకు తాగునీటి సరఫరా జరిగే సాగర్ కాలువ కట్ట ధ్వంసమవుతోంది. ఈ విషయంపై ఇరిగేషన్‌శాఖ అధికారులు సాగర్ కాలువ కట్టపై గ్రావెల్ టిప్పర్లు తిరగకుండా ఉండేందుకు కందకాలు తవ్వారు. అయినా లెక్కచేయని గ్రావెల్ మాఫియా ఆయా కందకాలు పూడ్చివేసి యాథావిధిగా తమ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఒంగోలు మండలం యరజర్ల, సర్వేరెడ్డిపాలెం, టంగుటూరు మండలంలోని కొణిజేడు గ్రామాల పరిధిలో కొండ ఉంది. దీని చుట్టూ ఉన్న భూముల్లో అక్రమంగా గ్రావెల్ క్వారీయింగ్ చేసి ఒంగోలు నగరపరిధిలోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు భారీగా తరలిస్తున్నారు. వాహనాల రాకపోకలకు సాగర్ కాలు వకట్టను ఎంచుకున్నారు. నిబంధనల ప్రకారం కాలువ కట్టపై గ్రావెల్ టిప్పర్లు తిరిగేందుకు అనుమతి లేదు. దీనిపై ఇరిగేషన్ అధికారులు టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతి రోజూ సుమారు 200 టిప్పర్లు గ్రావెల్‌తో తిరుగుతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం మట్టి తవ్వకాలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అయితే ఇక్కడ ఎలాంటి నిబంధనలు అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రాష్ట్రానికి ఇదే శాశ్వత రాజధాని.. ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దుతా: సీఎం

**కరెంటు చార్జీలు పెంచం**
**జగన్ ప్రభుత్వం 32 వేలకోట్లు పెంచింది**
**రాష్ట్రాన్ని గంజాయికి కేంద్రంగా మార్చింది**
**ప్రభుత్వ ఉద్యోగులకు వేల కోట్ల బకాయిలు**
**ఆఖరికి దేవుడి నెయ్యినీ కల్తీ చేశారు**
**నేను క్రెడిట్ చోరీ చేశానంటున్నారు**
**అసలు జగన్‌కేం క్రెడిట్ ఉంది?**
**ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండండి**
**మేం వచ్చాక 18 నెలల్లోనే 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి**
**దేశానికి వచ్చినవాటిలో ఏపీకే 25 శాతం**
**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు**




క్రైం కౌంటర్ న్యూస్,నగరి, జనవరి 24 : 'అమరావతి విషయంలో నాటకాలు వేశారు. మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని శ్మశానం అన్నారు. కేసులు వేశారు. అడ్డుకుంటానని జగన్ మళ్లీ ప్రకటించారు. ఎవరు అడ్డుకున్నా ప్రపంచ శ్రేణి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతా. రాష్ట్ర రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుంది. ఎన్ని కుయుక్తులు పన్నినా అమరావతిని అడ్డుకోలేరు' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కరెంటు చార్జీలు పెంచడం లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ.32 వేల కోట్ల చార్జీలను పెంచిందని విమర్శించారు.

వైసీపీ వేసి న రూ.4,600 కోట్ల డ్యూటీ ఫీజును ప్రజల పై భారం పడకుండా తమ ప్రభుత్వం రద్దు చేసినట్లు చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. దేశంలోని వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం మనకే వచ్చాయన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నాన ని, 94 శాతం అభ్యర్థులు గెలవడం ఎప్పు డూ చూడలేదని అన్నారు. తాను ఈ సారి చేయగలుగుతున్న అభివృద్ధి గత మూడు దఫాల్లో చేయలేకపోయానన్నారు.

నాడు అన్నింటా నిర్లక్ష్యం

'రాజకీయ పార్టీ నడిపే వ్యక్తులు బాధ్యతగా మాట్లాడాలి. జల్ జీవన్ మిషన్‌లో రూ.లక్ష కోట్ల మేర వాడుకునే అవకాశం ఉన్నా గతంలో నిర్లక్ష్యంతో వదిలేశారు. కేంద్ర పథకాలన్నీ నిర్వీర్యం చేశారు. రాష్ట్రాన్ని గంజాయికి కేంద్రంగా మార్చారు' అంటూ గత వైసీపీ ప్రభుత్వ తీరుపై చంద్రబాబు మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక ఈగల్ వ్యవస్థను పెట్టి గంజాయిని కట్టడి చేశామన్నారు. 'పోలవరం డయాఫ్రం వాల్‌ను వరదల్లో కొట్టుకుపోయేలా చేశారు. ఇప్పుడు మళ్లీ నిర్మిం చి 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. రాయలసీమ వరకు నీళ్లను తెస్తాం' అని స్పష్టం చేశారు.

దేవుడి నెయ్యినీ కల్తీ చేశారు

ప్రభుత్వ ఉద్యోగులకు కూడా గత జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలు పెట్టిందని చంద్రబాబు విమర్శించారు. తాము విడతల వారీగా నిధులు ఇస్తున్నామని తె లిపారు. పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను కూడా మూసేశారని, ఆఖరికి దేవుడి నెయ్యినీ కల్తీ చేశారని మండిపడ్డారు. 'సూపర్ సిక్స్ పథకాల అమలు అ సాధ్యమని విమర్శించారు. కూటమి ప్రభు త్వం సూపర్ హిట్ చేసి చూపించింది. ఏడాదికి రూ.33 వేల కోట్లను పేదల కోసం పంపిణీ చేస్తున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లను పంపిణీ చేస్తున్నాం. ప్రజ ల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పనిచేయాలనే ఉద్దేశంతోనే పేదల సేవలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు.

కార్యకర్తలను మరచిపోను

టీడీపీకి ఉన్నంతమంది కార్యకర్తలు ప్రపంచంలో ఏ పార్టీకీ లేరని సీఎం చంద్రబాబు అన్నారు. నగరిలో ఎస్సీ హాస్టల్‌కు వెళ్లి సోలార్ ప్లాంటును పరిశీలించారు. కార్యకర్తల సమావేశంలో సుదీర్ఘంగా మా ట్లాడారు. 'టీడీపీకి ఉన్న కార్యకర్తలు ఏ పార్టీకి లేరు. మిమ్మల్ని మరచిపోను. ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాను. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలి.' అన్నారు.

# పది'పై ఫోకస్

క్రైం కౌంటర్ న్యూస్,ఒంగోలు విద్య, జనవరి 24 : ప్రభు త్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యా ర్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది. ఆ మేరకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. దానిపై కలెక్టర్ రాజాబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీనికోసం ప్రతి హైస్కూలుకు ఒక మండలస్థాయి గెజిటెడ్ అధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. ఇలా మొత్తం 354 మందిని కేటాయించారు. ఇప్పటికే డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో పాఠశాలలను సందర్శిస్తున్నారు. వీరితోపాటు పర్యవేక్షణాధికారులుగా నియమితులైన వారు పాఠశాలలకు వెళ్లి మార్గనిర్దేశం చేస్తున్నారు.

వారానికి రెండుసార్లు సందర్శించాలి

పర్యవేక్షణాధికారులుగా నియమితులైన అధికారులు వారానికి కనీసం రెండు సార్లు పాఠశాలను సందర్శించి పిల్లల్లో స్ఫూర్తిని నింపాలి. విద్యాపరంగా వెనుకబడిన వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షించి విద్యార్థుల ప్రతిభ ప్రగతిని తెలుసుకోవాలి. రైజింగ్‌స్టార్స్ స్థానంలో ఉన్నవారిని షైనింగ్ స్టార్స్ స్థాయికి ఎదిగేలా చూడాలి. విద్యార్థులకు నిర్వహించే రోజువారీ స్లిప్‌టెస్ట్‌లు, వారాంత పరీక్షలు, రివిజన్ టెస్టులు షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నారా? జవాబుపత్రాలను దిద్దుతున్నారా? అన్నది పరిశీలించాలి. అధికారులు ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి వెనుకబడిన వారికి రెమిడియట్ టీచింగ్, ప్రత్యేక తరగతులు, సందేహ నివృత్తి తరగతులు నిర్వహించేలా చూడాలి.

అంతా అప్రమత్తం చేయాలి

ప్రత్యేక తరగతులను విద్యార్థుల హాజరును కూడా ప్రత్యేకాధికారులు పరిశీలించనున్నారు. తరగతులకు గైర్హాజరవుతున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతిరోజూ క్రమంతప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాల్సి ఉంది. పాఠశాలన్నింటిలో సంబంధిత క్లాసులు నిర్వహిస్తున్నారా? విద్యార్థుల ప్రగతి రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా? అన్నది పరిశీలించాలి. తరగతి గది వాతావరణ, క్రమశిక్షణ, ఇతర అంశాలు పరిశీలించి ఏమైనా లోపాలుంటే వెంటనే డీఈవోకు తెలియజేయాలి. అధికారులు పాఠశాలల సందర్శనకు సంబంధించిన నివేదికలను సమర్పించాలి, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో లోపాలని గుర్తించాలి. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రోజువారీగా మండలస్థాయి అధికారులతో నిర్వహించే టెలికాన్ఫరెన్సుల్లో 10వతరగతి పిల్లల విషయం ప్రస్తావిస్తూ అధికారులను అలెర్ట్ చేసున్నారు.




# కొత్త కొత్తగా.. సుదీర్ఘంగా



క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, జనవరి 24: ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంటర్ విద్యామండలి తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో పరీక్షల స్వరూపం చాలా వరకు మారిపోయింది. ముఖ్యంగా ప్రతి సంవత్సరం 16 రోజుల్లో పరీక్షలు ముగుస్తుండగా.. ఈ ఏడాది నుంచి 23 రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి. పాత విధానంలో ఒక్కోరోజు రెండు లేదా మూడు సబ్జెక్టుల పరీక్షలు జరిగేవి. కానీ, ఇప్పుడు 'ఎలక్టివ్' విధానంతో ఒక రోజు ఒక సబ్జెక్టు పరీక్ష మాత్రమే నిర్వహించనున్నారు. మరోవైపు ఎలక్టివ్ విధానంతో విద్యార్థులు వారి కాంబినేషన్‌కు సంబంధం లేని సబ్జెక్టులు తీసుకుంటున్నారు. అనేక మంది విద్యార్థులు ఎంబైపీసీ చదువుతున్నారు. ఇలాంటి వారికి నూతన విధానం మేలు చేయనుంది.ఆరు నుంచి ఐదు!చాలా కాలం నుంచి ఇంటర్మీడియట్‌లో గణితం ఏ, బీ రెండు సబ్జెక్టులుగా ఉంది. దీనిని ఈ విద్యా సంవత్సరంలో ఒకే సబ్జెక్టుగా మార్చారు. అలాగే వృక్ష, జంతు శాస్త్రలు రెండు సబ్జెక్టులుగా ఉంటే వాటిని కూడా కలిపి బయాలజీ చేశారు. దీంతో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో సబ్జెక్టులు ఆరు నుంచి ఐదుకు తగ్గాయి. రెండు గ్రూపుల విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు కామన్‌గా ఉంటాయి. ఇంగ్లిష్ సబ్జెక్టును మాత్రం ఆర్ట్స్‌తో సహా అన్ని గ్రూపుల విద్యార్థులు తప్పనిసరిగా తీసుకోవాలి. మరొక సబ్జెక్టును ఎలక్టివ్‌గా తీసుకోవచ్చు. దీంతో ఇంటర్మీడియట్‌లో ఉన్న మొత్తం 24 సబ్జెక్టుల నుంచి ఏ గ్రూపు విద్యార్థి అయినా ఏ సబ్జెక్టునైనా ఎలక్టివ్‌గా ఎంపిక చేసుకోవచ్చు. దీంతో చాలా మంది విద్యార్థులు వారి గ్రూపు కాంబినేషన్‌కు ఏమాత్రం సంబంధం లేని సబ్జెక్టులు తీసుకున్నారు. సీఈసీ విద్యార్థుల్లో అనేక మంది చరిత్ర(హిస్టరీ) తీసుకున్నారు. ఆశ్చర్యకరంగా ఎంపీసీ విద్యార్థుల్లో చాలా మంది జాగ్రఫీ తీసుకుని చదువుతున్నారు. అలాగే కామర్స్, చరిత్ర తీసుకున్న వారు కూడా ఉన్నారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు వారి గ్రూపునకు సంబంధం లేని సబ్జెక్టులు ఎంచుకున్నారు.

వారికి మరింత అవకాశం

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఇంటర్ విద్యామండలి మరింత విస్తృత అవకాశం కల్పించింది. మిగిలిన గ్రూపులకు లేనివిధంగా అదనపు సబ్జెక్టు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో సుమారు వెయ్యి మంది ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, 3 వేల మంది బైపీసీ విద్యార్థులు గణితాన్ని అదనపు సబ్జెక్టుగా తీసుకుని చదువుతున్నారు. అలాగే, ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు గణితాన్ని ఎలక్టివ్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకున్నారు. అయితే, ఎలక్టివ్ సబ్జెక్టులా తీసుకుంటే తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. అదే అదనపు సబ్జెక్టుగా తీసుకుంటే ఉత్తీర్ణత తప్పనిసరి కాదు. ఉ తీర్ణులైతే అదనపు మెమో జారీ చేస్తారు. ఇలా చదవడం వల్ల విద్యార్థులు ఎంబైపీసీ చదివినట్లు అవుతుంది. దానివల్ల భవిష్యత్తులో ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. సబ్జెక్టుల విలీనం వల్ల మార్కులు కూడా మారాయి. అలాగే, థియరీ పరీక్షలు రాసేందుకు ఇప్పటి వరకు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తుంటే ఇకపై 32 పేజీల బుక్‌లెట్లు ఇవ్వనున్నారు. ఇప్పటివరకు గణితం ఏ, బీ సబ్జెక్టులు 75 మార్కుల చొప్పున 150 మార్కులకు పరీక్షలు జరిగేవి. కొత్త విధానంలో ఈ ఏడాది 100 మార్కులతోనే పరీక్ష జరుగనుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో 85 మార్కులతో పరీక్షలు జరుగుతాయి. ఉత్తీర్ణతకు 35శాతం మార్కులు సాధించాలి.

# సినిమా




## మీకు మద్యం తాగే అలవాటు ఉందా?

ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముఖ్యంగా అమృతం సీరియల్ తో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారీ ట్యాలెంటెడ్ నటుడు. అందులో గుండు హనుమంతరావుతో కలిసి హర్షవర్ధన్ చేసిన కామెడీని ఎవరూ అంత ఈజీగా మర్చిపోలేరు. దీంతో పాటు శాంతి నివాసం, కస్తూరి తదితర సూపర్ హిట్ సీరియల్స్ లోనూ నటించి బుల్లితెర ఆడియెన్స్ కు బాగా చేరువయ్యారు హర్షవర్ధన్. సీరియల్స్ తో పాటు కొండవీటి సింహాసనం, ఐతే, అతడు, అనుకోకుండా ఒక రోజు, పౌర్ణమి వంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లోనూ ఈ నటుడు యాక్ట్ చేశారు. మధ్యలో కొన్నేళ్ల పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ ఇప్పుడు సహాయక నటుడిగా బిజీ బిజీగా ఉంటున్నాడు. కొండవీటి సింహాసనం, ఐతే, అతడు, అనుకోకుండా ఒక రోజు, అతడు, రాఖీ, స్టాలిన్, లక్ష్మీ కల్యాణం, లీడర్, పౌర్ణమి, గోల్కొండ హైస్కూల్, లవ్లీ, గబ్బర్ సింగ్, గోవిందుడు అందరి వాడేలే, గీతాంజలి, బ్రూస్లీ, ఊపిరి, 118, బ్రోచేవారెవరురా, జాంబిరెడ్డి, అక్షర, ఏక్ మినీ కథ, పుష్పక విమానం, సేనాపతి, స్వాతి ముత్యం, హిట్ ది సెకెండ్ కేస్, సుందరం మాస్టర్, సరిపోదా శనివారం, మారుతీ నగర్ సుబ్రమణ్యం, కోర్టు, పరదా తదితర సూపర్ హిట్ సినిమాల్లో హర్షవర్ధన్ చేసిన పాత్రలకు మంచి గుర్తింపు వచ్చింది. ఇక తాజాగా మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకరవర ప్రసాద్ గారు మూవీలోనూ ఓ కీరోల్ పోషించారు హర్షవర్ధన్.

ప్రస్తుతం మన శంకరవర ప్రసాద్ గారు సినిమా సక్సెస్ ను ఎంజాయ్ చేస్తోన్న ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇదే క్రమంలో మందుబాబులకు కొన్ని మంచి సూచనలు కూడా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది.

'ఒక పెగ్గు మద్యం తాగిన తర్వాత కచ్చితంగా గ్లాస్ నీళ్లు తాగాలి. అలా ప్రతి పెగ్గుకు నీళ్లు తాగడం వల్ల శరీరం పైన మద్యం ప్రభావం తగ్గుతుంది. ఈ విషయాన్ని నేను నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి నుంచి నేర్చుకున్నాను. డ్రింక్ చేయడానికి ముందు ఆయన అర లీటర్ నీళ్లు తాగుతారు. ఇలా తాగడం వల్ల కొంతవరకు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని ఆయన చెప్పారు' అంటూ హర్షవర్ధన్ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ నటుడి వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరలవుతోంది.





## భోజనం తర్వాత టీ తాగడం వల్ల మీ ఆరోగ్యం దెబ్బతింటుందా?

టీ అనేది ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఇష్టపడే పానీయం. ముఖ్యంగా మన భారతదేశంలో ఇది చాలా ప్రజాదరణ పొందింది. ఉదయం లేదా సాయంత్రం అయినా ప్రజలు దీనిని తాగకుండా ఉండలేరు. కొందరు భోజనంతో లేదా భోజనం తర్వాత వెంటనే కూడా దీనిని ఆస్వాదిస్తారు. అయితే భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత వెంటనే టీ తాగడం మీ ఆరోగ్యానికి చాలా హానికరం అని నిపుణులు చెబుతున్నారు. ఇది రుచిగా ఉన్నప్పటికీ ఈ కలయిక వైద్యపరంగా చాలా ప్రమాదకరం అంటున్నారు. భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత టీ తాగే అలవాటు ఎంత హానికరమో అన్వేషిద్దాం.

ఆహారంతో పాటు టీ తాగడం ఎందుకు ప్రమాదకరం?

వైద్య నిపుణులు ప్రకారం.. భోజనం తర్వాత టీ తాగడం వల్ల మీ ఆరోగ్యానికి అనేక విధాలుగా హాని కలుగుతుంది. టీలో ఉండే టానిన్ అనే రసాయనం వల్ల హాని కలుగుతుంది. సైన్స్ ప్రకారం, టానిన్ ఆహార ఐరన్?తో బంధిస్తుంది. ముఖ్యంగా నాన్-హీమ్ ఐరన్? (పప్పుధాన్యాలు, కూరగాయలలో లభిస్తుంది), శరీరం దానిని గ్రహించకుండా నిరోధిస్తుంది. ఇది చాలా కాలం పాటు జరిగితే అది శరీరంలో ఐరన్? లోపానికి దారితీస్తుంది. ఇది హిమోగ్లోబిన్ లోపంతో నేరుగా ముడిపడి ఉంటుంది. తద్వారా రక్తహీనత ప్రమాదాన్ని పెంచుతుంది.ఇవి కూడా ప్రతికూలతలు కావచ్చు:

జీర్ణవ్యవస్థలో ఆటంకాలు: భోజనంతో లేదా భోజనం తర్వాత టీ తాగడం వల్ల కూడా మీ జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. టీలోని కెఫిన్ కడుపు ఆమ్లాన్ని పెంచుతుంది. ఇది ఆమ్లత్వం, గుండెల్లో మంట లేదా ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. అవసరమైన పోషకాలు లేకపోవడం: టీ శరీరం ఐరన్?ను గ్రహించకుండా నిరోధించడమే కాకుండా ఆహారం నుండి ఇతర పోషకాలను కూడా నిరోధిస్తుంది. ఇది అవసరమైన పోషకాల లోపానికి దారితీస్తుంది. ఇది ఎముకల బలహీనతకు, రోగనిరోధక శక్తి బలహీనపడటానికి దారితీస్తుంది . నిద్ర సమస్యలు: రాత్రి భోజనంతో పాటు లేదా తర్వాత టీ తాగడం వల్ల మీ నిద్ర దెబ్బతింటుంది. టీలోని కెఫిన్ మీ మెదడుపై ఎఫెక్ట్ చూపుతుంది. దీంతో నిద్రకు భంగం కలుగుతుంది.టీ తాగడానికి సరైన సమయం ఏది?

టీ తాగడానికి సరైన సమయం విషయానికి వస్తే మీరు దానిని ఎప్పుడూ ఖాళీ కడుపుతో తాగకూడదు. ఇంకా ఆరోగ్యంగా ఉండటానికి కీలకం ఏమిటంటే భోజనం, టీ మధ్య కనీసం ఒకటి నుండి రెండు గంటల సమయం ఉంచడం మంచిది.

(నోట్?: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందిస్తున్నాము. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నాము.)



## బరువు తగ్గేందుకు ఏది బెస్ట్..

మన దేశంలో చాలా మంది మార్నింగ్? బ్రేక్?ఫాస్ట్?లోకి ఇడ్లీ, దోశ, పోహా వంటి ఆహారాలను తీసుకుంటూ ఉంటారు. ఇందులో ఇడ్లీ, పోహా విషయానికి వస్తే.. రెండూ తేలికైనవి, రుచికరమైనవి. వీటిని త్వరగా వండుకోవచ్చు. అలాగే వీటిని పిల్లల నుంచి పెద్దల వరకు ఇంట్లోని ప్రతి ఒక్కరూ ఇష్టపడుతారు. కానీ బరువు తగ్గడం, మెరుగైన జీర్ణక్రియ, రోజంతా శక్తి విషయానికి వస్తే, ప్రజలు తరచుగా ఇడ్లీ లేదా పోహా తినాలా వద్దా అనే విషయంలో గందరగోళానికి గురవుతారు. అందువల్ల, ఈ రెండింటిలో ఏది, ఎందుకు ఆరోగ్యకరమైనదో చూద్దాం.పోషక విలువల పరంగా

ఇడ్లీని పులియబెట్టిన బియ్యం, మినపప్పుతో తయారు చేస్తారు. ఇందులో ప్రోటీన్, బి విటమిన్లు, జీర్ణక్రియకు సహాయపడే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటాయి. పోహాను కూడా చదును చేసిన బియ్యంతో తయారు చేస్తారు. అలాగే దీన్ని కూరగాయలు, వేరుశెనగలు, తేలికపాటి సుగంధ ద్రవ్యాల వండుతారు కాబట్టి దీని రుచి అద్భుతంగా ఉంటుంది. ఇది శరీరానికి ఇనుము, తేలికపాటి కార్బోహైడ్రేట్లు, ఫైబర్?ను అందిస్తుంది.కేలరీలు, బరువు తగ్గడం

ఒక మీడియం ఇడ్లీలో దాదాపు 39 కేలరీలు ఉంటాయి. అలాగే కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది, ఇది బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి ఆరోగ్యకరమైన ఎంపిక. మరోవైపు, ఒక గిన్నె పోహా తయారీ పద్ధతిని బట్టి దాదాపు 180--200 కేలరీలు కలిగి ఉంటుంది. ఇందులో అధిక కేలరీల కంటెంట్ ఉన్నప్పటికీ, పోహా మీకు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. కానే దీన్ని వండేప్పుడు ఎక్కువ నూనెను ఉపయోగిస్తే.. బరువుపెరిగే అవకాశం ఉంటుంది.

జీర్ణక్రియ, పేగు ఆరోగ్యం

ఇడ్లీని కిణ్వ ప్రక్రియ ద్వారా తయారు చేస్తారు, కాబట్టి ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే, పోషకాలను బాగా గ్రహించడాన్ని ప్రోత్సహించే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్) ఉంటుంది. ఇడ్లీ మృదువుగా, తేలికగా, సులభంగా జీర్ణమయ్యేలా ఉంటుంది. కాబట్టి పిల్లలు లేదా వృద్ధులు ఎవరు తిన్నా సులభంగా జీర్ణయం అవుతుంది.

## గంభీర్ కాదు..ఆ వ్యక్తి కాళ్ల మీద పడ్డ సూర్యకుమార్..

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మైదానంలో తన బ్యాట్?తోనే కాదు, తన ప్రవర్తనతోనూ అందరి మనసు గెలుచుకున్నాడు. న్యూజిలాండ్?తో జరిగిన రెండో టీ20లో ఆకాశమే హద్దుగా చెలరేగి, 82 పరుగుల మెరుపు ఇన్నింగ్స్?తో జట్టుకు విజయాన్ని అందించిన సూర్య.. మ్యాచ్ ముగిసిన తర్వాత ఒక అరుదైన దృశ్యానికి వేదికయ్యాడు. దాదాపు 15 నెలల తర్వాత అంతర్జాతీయ టీ20ల్లో హాఫ్ సెంచరీ మార్కును అందుకున్న సంతోషంలో, సూర్య చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాయ్?పూర్ టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. గత కొన్ని నెలలుగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న సూర్యపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరిసారిగా 2024 అక్టోబర్?లో బంగ్లాదేశ్?పై హైదరాబాదులో హాఫ్ సెంచరీ చేసిన సూర్య, మళ్లీ ఇన్నాళ్లకు అంటే సుమారు 15 నెలల తర్వాత తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 37 బంతుల్లోనే 82 పరుగులు చేసి అజేయంగా నిలిచిన సూర్య, జట్టుకు ఘనవిజయాన్ని అందించాడు. అయితే మ్యాచ్ గెలిచిన అనంతరం జరిగిన ఒక సంఘటన నెటిజన్ల మనసును హత్తుకుంది.జట్టులోని ఆటగాళ్లతో పాటు కోచ్ గౌతమ్ గంభీర్?కు షేక్ హ్యాండ్ ఇచ్చిన సూర్యకుమార్.. టీమిండియా త్రో-డౌన్ స్పెషలిస్ట్ రఘు కనిపించగానే ఒక్కసారిగా ఆయన కాళ్లపై పడి నమస్కరించాడు. ఇది చూసి రఘు కూడా ఆశ్చర్యపోయి వెంటనే సూర్యను పైకి లేపి హత్తుకున్నారు. అసలు సూర్య అంతటి గౌరవాన్ని రఘుకు ఎందుకు ఇచ్చాడంటే.. ఫామ్ కోల్పోయి సతమతమవుతున్న సమయంలో నెట్స్ లో గంటల తరబడి సూర్యకు ప్రాక్టీస్ చేయించింది రఘునే. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసురుతూ, బ్యాటర్లను మ్యాచ్?కు సిద్ధం చేయడంలో రఘు దిట్ట.రఘు టీమిండియాలో గత పదేళ్లుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు కూడా రఘు సేవలను బహిరంగంగానే కొనియాడారు. "మేము మ్యాచ్?ల్లో రాణించడానికి కారణం నెట్స్?లో రఘు మాపై చూపించే కఠినత్వమే" అని కోహ్లీ ఒకానొక సందర్భంలో చెప్పాడు. ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ కూడా తన రీఎంట్రీలో రఘు పాత్ర ఎంత ఉందో ఈ చిన్న చేష్ట ద్వారా ప్రపంచానికి చాటిచెప్పాడు. కేవలం కొన్ని వారాల క్రితమే తిలక్ వర్మ కూడా సెంచరీ చేసిన తర్వాత రఘు కాళ్లు మొక్కిన విషయం తెలిసిందే.




## ఒకే మ్యాచ్ లో 5 ప్రపంచ రికార్డులు గల్లంతు

రాయ్?పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో టీమిండియా సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కేవలం 15.2 ఓవర్లలోనే ఊదేశింది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ బ్యాట్?లతో విరుచుకుపడటంతో మైదానంలో పరుగుల వరద పారింది. ఈ మ్యాచ్?లో గెలుపుతో పాటు ఏకంగా ఐదు భారీ రికార్డులు బద్దలయ్యాయి. కివీస్ బౌలర్లు చుక్కలు చూడగా, భారత బ్యాటర్లు చరిత్ర తిరగరాశారు.న్యూజిలాండ్?పై వేగవంతమైన హాఫ్ సెంచరీ

భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్?లో ఊచకోత కోశాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, టీ20ల్లో న్యూజిలాండ్?పై అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన భారత ప్లేయర్?గా రికార్డు సృష్టించాడు. సరిగ్గా 48 గంటల క్రితమే అభిషేక్ శర్మ (22 బంతుల్లో 50) నెలకొల్పిన రికార్డును ఇషాన్ చెరిపేయడం విశేషం.

2. పవర్ ప్లేలో నాన్-ఓపెనర్ సరికొత్త చరిత్ర

సాధారణంగా పవర్ ప్లేలో ఓపెనర్లు మాత్రమే హాఫ్ సెంచరీలు సాధిస్తుంటారు. కానీ ఈ మ్యాచ్?లో సంజు శాంసన్ త్వరగా అవుట్ కావడంతో వన్ డౌన్?లో వచ్చిన ఇషాన్ కిషన్, పవర్ ప్లే ముగిసేలోపే తన యాభై పరుగులు పూర్తి చేశాడు. తద్వారా పవర్ ప్లేలో హాఫ్ సెంచరీ బాదిన తొలి నాన్ ఓపెనర్ భారత బ్యాటర్?గా ఇషాన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

3. 200o రన్ ఛేజ్?లో వరల్డ్ రికార్డ్

టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో (ఫుల్ మెంబర్ జట్ల మధ్య) 200 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా భారత్ నిలిచింది. 209 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే టీమ్ ఇండియా పూర్తి చేసింది. గతంలో పాకిస్థాన్ (24 బంతులు మిగిలి ఉండగా 205 రన్స్ ఛేజ్) పేరిట ఉన్న రికార్డును భారత్ బద్దలు కొట్టింది.

4. కివీస్ బౌలర్ జాక్ ఫౌల్క్స్ అవాంఛనీయ రికార్డు

న్యూజిలాండ్ బౌలర్ జాక్ ఫౌల్క్స్ కు ఈ మ్యాచ్ ఒక పీడకల. కేవలం 3 ఓవర్లలోనే 67 పరుగులు సమర్పించుకున్నాడు. టీ20 క్రికెట్ చరిత్రలో ఒక కివీస్ బౌలర్ ఒకే మ్యాచ్?లో ఇన్ని పరుగులు ఇవ్వడం ఇదే మొదటిసారి. 2018లో బెన్ వీలర్ (64 పరుగులు) పేరిట ఉన్న చెత్త రికార్డును ఫౌల్క్స్ తన ఖాతాలో వేసుకున్నాడు.

5. మొదటి ఓవర్?లోనే అర్షదీప్ చెత్త రికార్డు

భారత పేసర్ అర్షదీప్ సింగ్ కూడా ఒక అవాంఛనీయ రికార్డును మూటగట్టుకున్నాడు. మ్యాచ్?లోని తొలి ఓవర్?లోనే 18 పరుగులు ఇచ్చి, టీ20ల్లో మొదటి ఓవర్?లో అత్యధిక పరుగులు ఇచ్చిన భారత బౌలర్?గా నిలిచాడు. గతంలో 2022లో ఐర్లాండ్ ప్లేయర్ పాల్ స్టిర్లింగ్ భారత బౌలర్?పై 18 పరుగులు రాబట్టగా, ఇప్పుడు అర్షదీప్ ఆ రికార్డును సమం చేశాడు.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com